సాక్షి రంగారెడ్డి
సోమవారం, 20, జనవరి, 2025



బీఆర్‌ఎస్‌ను వీడేదిలేదు

బీఆర్‌ఎస్ పార్టీని ఎట్టి పరిస్థితుల్లో వీడేది లేదని డీసీఎంఎస్ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి స్పష్టం చేశారు. 8లో▸



కాసుల పంట.. క్యారెట్

క్యారెట్ సాగు రైతులకు కాసులు కరిపిస్తోంది. తక్కువ పెట్టుబడితో అధిక లాభం పొందొచ్చని వ్యవసాయాధికారులు తెలిపారు. 8లో▸



భూములివ్వం

ఫ్యూచర్ సిటీ రహదారికి భూములు ఇచ్చేది లేదని బాధిత రైతులు స్పష్టం చేశారు. ఈ మేరకు తీర్మానించారు. 8లో▸

న్యూస్‌రీల్

వాహనాల వేలం.. రూ.55.06 లక్షల ఆదాయం



తుర్కయంజాల్: ఇబ్రహీంపట్నం ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయంలో పరిధిలో పన్నులు చెల్లించని, ఇతర కారణాలతో సీజ్ చేసిన వాహనాలకు ఆదివారం మన్నెగూడలోని ఆర్టీఏ కార్యాలయంలో వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా రవాణా అధికారి సుభాష్ చందర్ రెడ్డి మాట్లాడుతూ.. మహేశ్వరం, బండ్లగూడ, హయత్‌నగర్, ఇబ్రహీంపటన్నం బస్ డిపోల పరిధిలో గడిచిన ఐదేళ్లుగా సీజ్ చేసిన 178 వాహనాలకు వేలం నిర్వహించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా రవాణ శాఖకు రూ. రూ.55.06 లక్షల ఆదాయం వచ్చిందని తెలిపారు.

సాగు భూములకే రైతుభరోసా

జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు



భూముల వివరాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు

కేశంపేట: రైతులు సాగు చేస్తున్న వ్యవసాయ భూములకే రైతు భరోసా అందించడం జరుగుతుందని జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహారావు అన్నారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, వ్యవసాయ అధికారుల సమక్షంలో వ్యవసాయ మోగ్యం కాని భూముల సర్వే మండలంలో కొనసాగుతోంది. ఇందులో భాగంగా మండల పరిధిలోని అల్వాల గ్రామంలో ఆదివారం నిర్వహిస్తున్న సర్వేను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా పథకంలో భూములను గుర్తించడం జరుగుతోందని తెలిపారు. వ్యవసాయం చేయని భూములను తొలగిస్తామని, తొలగించిన భూముల సర్వే నంబర్లను గ్రామాల్లో జరిగే గ్రామసభల్లో ప్రజలకు వివరిస్తామని చెప్పారు. అక్కడ రైతులు, ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు వివరించారు. రైతు భరోసా కోసం పరిశీలించిన భూముల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏడీఏ రాజరత్నం, తహసీల్దార్ అజాంఅలీ, ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, ఎంపీఓ కిష్టయ్య, ఏఈఓ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

షాద్‌నగర్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కమల ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలలో జంతుశాస్త్రం, ఇంగ్లిష్ సబ్జెక్టులను బోధించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. సంబంధిత సబ్జెక్టుల్లో పీజీలో కనీసం 55 శాతం మార్కులు కలిగి ఉండాలని.. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులైతే కనీసం 50 శాతం ఉత్తీర్ణత కలిగి ఉండాలని చెప్పారు. నెట్, సెట్, పీహెచ్‌డీల్లో ఏదైనా అర్హత సాధించాలన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 21వ తేదీ వరకు కళాశాలలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. 22న హయత్‌నగర్‌లో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు.

ప్రధానోపాధ్యాయురాలిని అభినందించిన కేంద్ర మంత్రి



మమతారెడ్డిని సన్మానించి జ్ఞాపిక అందజేస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

మొయినాబాద్: మండల పరిధిలోని పెద్దమంగళారంలో ఉన్న సరస్వతి శిశుమందిర్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మమతారెడ్డిని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అనభినందించారు. నగరంలోని శిల్పారామంలో జరిగిన లోక్ మంథన్ కార్యక్రమం విజయవంతం చేయడానికి సహకరించిన పలు పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు, ప్రధానోపాధ్యాయులను ఆదివారం అబిడ్స్‌లోని స్టాన్లీ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు. అందులో భాగంగా పెద్దమంగళారం సరస్వతి శిశుమందిర్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మమతారెడ్డిని సన్మానించి జ్ఞాపికను అందజేశారు.



నిధుల 'పురం'పర!

క్లైమాక్స్ మార్క్

- మున్సిపాలిటీ పాలకమండళ్లకు మిగిలింది కొద్ది రోజులే ..
- గడువు ముగిసే వేళ కాసుల గలగల
- నిధుల వరద కురిపించిన ప్రభుత్వం
- సీసీరోడ్లు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపనలు
- ఆయా పురపాలికల్లో జోరుగా అభివృద్ధి పనులు

ఏ మున్సిపాలిటీకి ఎంతంటే..

- తుక్కుగూడ మున్సిపాలిటీకి రూ.32 కోట్లు.
- మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌కు రూ.17.74 కోట్లు.
- పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీకి రూ.35 కోట్లు. 24 వార్డులు ఉండగా, సీసీ రోడ్లు, డ్రైనేజీ పనుల కోసం ఒక్కో వార్డుకు రూ.50 లక్షల చొప్పున కేటాయించారు.
- బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌కు రూ.87 కోట్లు. నాలుగైదు రోజుల్లో కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసి డివిజన్ల వారీగా నిధులు కేటాయించనున్నారు.
- ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీకి టీయూఎఫ్ఐడీసీ కింద రూ.6.35 కోట్లు. ఇప్పటికే ఈ నిధులను సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, కమ్యూనిటీ హాల్ నిర్మాణాలకు కేటాయించారు.
- బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ ఖాతాలో రూ.96.73 కోట్లు.
- కొత్తూరు మున్సిపాలిటీ ఖాతాలో రూ.50 కోట్లు. వీటిలో పూలే విగ్రహం నుంచి వినయకాస్టీల్ కూడలి వరకు సీసీరోడ్డు పనులకు రూ.18 కోట్లు, ఎస్సీకాలనీ నుంచి కుమ్మరిగూడ చేగూర్ రోడ్డు వరకు సీసీ రోడ్డు పనులకు రూ.32 కోట్లు కేటాయించారు.
- తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఖాతాలో రూ.49 కోట్లు. త్వరలోనే కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసి, అభివృద్ధి పనులకు నిధులు కేటాయించనున్నారు.
- శంకర్‌పల్లి మున్సిపాలిటీలో అమృత్ 2.0 కింద రూ.32.47 కోట్లు మంజూరు చేయించి, ఈ మేరకు ఇటీవల తాగునీటి సరఫరా పథకానికి శంకుస్థాపన కూడా చేశారు.

సాక్షి, రంగారెడ్డిజిల్లా: మున్సిపాలిటీలు/కార్పొరేషన్లకు ప్రభుత్వం నిధుల వరద కురిపించింది. గడువు ముగిసే వేళ పెద్ద మొత్తంలో నిధులు జమ చేయడంతో పాలక మండళ్ల హర్షం వ్యక్తం చేస్తున్నాయి. వచ్చిన నిధులను వార్డుల వారీగా విభజించి, ఆఘమేఘాల మీద సీసీరోడ్లు, డ్రైనేజీ కాల్వలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేస్తున్నారు. నిజానికి స్టాంప్స్ డ్యూటీ (టీడీ ఫండ్), మ్యూటేషన్ ఫీజులు 2019 నుంచి ప్రభుత్వం వద్దే పెండింగ్‌లో ఉన్నాయి. ఆస్తిపన్ను, ఇంటి నిర్మాణాలకు అనుమతుల ద్వారా వచ్చే ఫీజులు మున్సిపాలిటీల నిర్వహణకు కూడా సరిపోవడం లేదు. దీంతో జిల్లాలోని మెజార్టీ మున్సిపాలిటీలు ఐదేళ్లుగా ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. చిన్న చిన్న పనులకు ప్రభుత్వం విదిల్చే నిధులపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. రేవంత్‌రెడ్డి సీఎంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత స్థానిక సంస్థలకు ఈ నిధులను విడుదల చేయించారు. ప్రస్తుత పాలక మండళ్ల గడువు ముగియనుండడం.. త్వరలోనే వాటికి ఎన్నికలు రానుండటం, మెజార్టీ స్థానాలపై కాంగ్రెస్ దృష్టి సారించడం తెలిసిందే. ఈలోపే ఆయా మున్సిపాలిటీల్లో తమ మార్క్ చాటుకునే ప్రయత్నం చేస్తున్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలకు భారీగా నిధులు కేటాయించి, వాటికి శంకుస్థాపనలు చేయడం ద్వారా వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవచ్చని భావిస్తున్నారు.

అధికారుల హడావుడి

ఐదేళ్లుగా ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడిన ఆయా మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల ఖాతాల్లో ప్రభుత్వం భారీగా నిధులు జమ చేయడం, పాలక మండళ్ల గడువు కూడా ముగియనుండటంతో అధికారుల్లో హడావుడి మొదలైంది. ఇప్పటి వరకు ప్రజలు, కౌన్సిలర్లు/కార్పొరేటర్ల నుంచి వచ్చిన అర్జీలతో పాటు వార్డుల వారీగా ఉన్న ప్రధాన సమస్యలు గుర్తించే పనిలో ఇంజనీరింగ్ విభాగం నిమగ్నమైంది. చేపట్టాల్సిన పనులకు అంచనాలు రూపొందిస్తున్నారు. చివరి ఈ ఐదు రోజుల్లో వార్డుల వారీగా నిధులు ఏరులై పారే అవకాశం లేకపోలేదు. వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం ఉంది. ఇప్పటికే పలు పనులకు శంకుస్థాపనలు చేసిన సభ్యులు.. ఆఖరి రోజు మరిన్ని పనులను మొదలు పెట్టే అవకాశం ఉంది.

పండుగ సాయన్న విగ్రహావిష్కరణ



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు

మహేశ్వరం: ముదిరాజులు రాజకీయంగా బలపడినప్పుడే ఆర్థికంగా ఎదుగుదల ఉంటుందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి పేర్కొన్నారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చందన చెరువు కట్టపై ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పండుగ సాయన్న విగ్రహాన్ని చేవెళ్ల లోక్‌సభ సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి ముదిరాజ్, తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నీలం మధు ముదిరాజ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ వీరుడు పండుగ సాయన్న నిత్యం పేద ప్రజల కోసం ఆలోచించేవాడని, రజాకార్ల అన్యాయాలను ఎదిరించి ప్రతి ఒక్కరికీ అండగా ఉన్నారన్నారు. పేద ప్రజల కడుపు నింపిన మహనీయుడు అని కొనియాడారు. పండుగ సాయన్న చూపిన మార్గంలో నడవాలని సూచించారు. కార్యక్రమంలో మీర్‌పేట మేయర్ దుర్గాదీప్ లాల్, బడంగ్‌పేట్ మేయర్ చిగురింత పారిజాత రెడ్డి, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, మీర్‌పేట ముదిరాజ్ సంఘం ప్రతినిధులు ఎడ్ల మల్లేష్ ముదిరాజ్, యాదగిరి ముదిరాజ్, తుమ్మల రమేష్, చింతల రాఘవేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న మాధవి

ఓపెన్ స్కూల్స్ స్టేట్ కో ఆర్డినేటర్ మాధవి

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని ఓపెన్ స్కూల్స్ స్టేట్ కో ఆర్డినేటర్ మాధవి అన్నారు. పట్టణంలోని జియోన్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు నిర్వహిస్తున్న తరగతులను ఆదివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యకు దూరమైన గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదువుకునేందుకు ఓపెన్ స్కూల్స్ గొప్ప అవకాశమని అన్నారు. భవిష్యత్‌లో ఉన్నత విద్యను అభ్యసించడానికి, ఉద్యోగాలు సాధించడానికి ఓపెన్ స్కూల్స్ ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. పరీక్షలు సమీస్తున్న తరుణంలో విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురి కాకుండా ప్రణాళికలను రూపొందించుకొని సిద్ధం కావాలని సూచించారు. కార్యక్రమంలో ఓపెన్ స్కూల్స్ జిల్లా కో ఆర్డినేటర్ కేవీ సత్యనారాయణ, పాఠశాల కో ఆర్డినేటర్ సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేసవిలో కరెంటు సమస్యలకు చెక్

- కార్యాచరణ ప్రణాళిక సిద్ధం
- సర్కిళ్లకు ఇన్‌చార్జుల నియామకం

సాక్షి, రంగారెడ్డి జిల్లా: రానున్న వేసవిలో విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే సెక్షన్ల వారీగా విద్యుత్ లైన్ల పునరుద్ధరణ, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లలో ఆయిల్ లీకేజీల నియంత్రణ, లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు వంటి పనులు చేపట్టింది. ఫిబ్రవరి మొదటి వారంలోగా ఈ పనులు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఆ తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ లోడ్ రిలీఫ్ (ఎల్సీ)లకు అవకాశం ఇవ్వకూడదని నిర్ణయించింది. గత వేసవి డిమాండ్‌ను, సరఫరాలో తలెత్తిన సాంకేతిక సమస్యలను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేకంగా కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసింది. సర్కిళ్ల వారీగా డైరెక్టర్, సీఈ స్థాయి అధికారులను ఇన్‌చార్జులుగా నియమించింది. వీరు రెప్పపాటు కూడా కరెంట్ పోకుండా పర్యవేక్షిస్తుంటారు. ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటించి, డిమాండ్, సరఫరాపై ఆరా తీయడంతో పాటు సాంకేతిక సమస్యలను ముందే గుర్తించి, సరఫరాలో అంతరాయం తలెత్తకుండా చూడనున్నారు. ఈ మేరకు సీపీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ ఆదివారం నగరంలోని విద్యుత్ లోడ్ పర్యవేక్షణ, నియంత్రణ (ఎల్ఎంఆర్‌సీ) విభాగాన్ని సందర్శించారు. ఇది సంస్థ పరిధిలోని సబ్ స్టేషన్ల లోడ్లను నిరంతరం పర్యవేక్షిస్తూ సర్కిళ్ల వారీగా ఏర్పడే అత్యధిక/అత్యల్ప డిమాండ్లను, వినియోగాన్ని రికార్డు చేస్తూ.. ఉన్నతాధికారులకు ఎప్పటికప్పుడు నివేదికలు అందజేయడంతో పాటు ఏదైనా ప్రాంతంలో అసాధారణ పరిస్థితులు తలెత్తితే.. వెంటనే సమాచారాన్ని సంబంధిత ఇంజినీర్లకు చేరవేస్తుంది.

సర్కిళ్ల వారీగా నియమితులైన ఇన్‌చార్జులు

సర్కిల్	ఇన్‌చార్జులు
రాజేంద్రనగర్	ఎన్.నరసింహులు, డైరెక్టర్, ఆపరేషన్స్
మేడ్చల్	కె.నందకుమార్, డైరెక్టర్, ప్రాజెక్ట్స్
హబ్సిగూడ	సాయిబాబా, డైరెక్టర్, కమర్షియల్స్
సరూర్‌నగర్	భిక్షపతి, సీఈ, కమర్షియల్
హైదరాబాద్ సెంట్రల్/వికారాబాద్	పి.ఆనంద్, సీఈ, పీఅండ్ఎం
హైదరాబాద్ సౌత్/ సైబర్‌సిటీ	రంగనాథ్ రాయ్, సీఈ ఎనర్జీ ఆడిట్
బంజారాహిల్స్	ప్రభాకర్, సీఈ, ఐపీసీ
సికింద్రాబాద్	నరసింహస్వామి, సీఈ, మాస్టర్‌ప్లాన్

మాలలపై వ్యతిరేక వైఖరిని మార్చుకోవాలి

చేవెళ్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాలల వ్యతిరేక వైఖరిని మానుకోవాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య అన్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ భవనంలో ఆదివారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ.. మేధావుల ముసుగులో మాలలపై విషం కుక్కుతున్న వారి కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. మాలలపై అదే పనిగా పరుష పదజాలంతో మాట్లాడటం సరికాదన్నారు. అంటరానితనం, ఆకలి, పేదరికం, అవమానాలతో అల్లాడుతున్న మాలలను ఉద్దేశపూర్వకంగా విమర్శించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మాల జాతి ఐక్యత కోసం అస్తిత్వ పోరాటాలు చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడిందన్నారు. అంతా కలిసి మెలికి ఉండాలని సూచించారు. సమావేశంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లు, మహిళా నాయకురాలు రవళి, కార్యదర్శి వికాస్, యువత ప్రధాన కార్యదర్శి బి.మహేశ్, జిల్లా అధ్యక్షుడు మహేశ్, ఉపాధ్యక్షులు యాదగిరి, సురేశ్, సహాయ కార్యదర్శి మాణిక్యం, ప్రచార కార్యదర్శి జగన్, సమతా సైనిక్ దళ్ జిల్లా అధ్యక్షుడు మాచన్‌పల్లి రామస్వామి తదితరులు ఉన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఆశలు ఫలించేనా?

- పెండింగ్‌లో సుమారు 3 లక్షలకుపైగా దరఖాస్తులు
- దాదాపు 6.5 లక్షల మందికి పైగా కొత్త సభ్యులు
- ఆన్‌లైన్‌లో అర్జీలకు వెనులుబాటు.. ఆమోదం మాత్రం పెండింగ్
- ఎనిమిదేళ్లుగా అర్జీదారుల ఎదురు చూపులు

పాత రేషన్ కార్డుల్లో కొత్త సభ్యులకు మోక్షం లభించేనా?



సాక్షి, సిటీబ్యూరో: ఈసారైనా ఆహార భద్రత (రేషన్) కార్డుల్లో కొత్త సభ్యులకు మోక్షం లభిస్తుందా? ఎనిమిదేళ్లుగా రేషన్ కార్డులోని సభ్యులు (యూనిట్లు) వివిధ సాకులతో తొలగింపునకు గురవుతున్నా.. కొత్త సభ్యుల చేర్పుల దరఖాస్తులకు మాత్రం మోక్షం లభించడం లేదు. ఇటీవల రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి 'మీ సేవ ద్వారా ఈపీడీఎస్ ఎఫ్ఎస్‌సీ లాగిన్‌లో కొత్త సభ్యుల చేర్పుల కోసం చేసుకున్న దరఖాస్తుల దీర్ఘకాలిక పెండెన్సీని సైతం అర్హత ప్రమాణాల ఆధారంగా క్లియర్ చేస్తాం' అని ప్రకటించడంతో లబ్ధిదారుల కుటుంబాల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

సుదీర్ఘకాలంగా పెండింగ్

బీఆర్ఎస్ ప్రభుత్వం రేపు మాపు అంటూ ఆశలు కల్పించింది. కొత్తగా అధికారంలోకి కాంగ్రెస్ కొలువుదీరి ఏడాది గడిచినా యూనిట్ల ఆమోదానికి ఊసే లేకుండా పోయింది. తాజాగా కొత్త రేషన్ కార్డుల మంజూరుకు కసరత్తు ప్రారంభించిన నేపథ్యంలో పాత కార్డుల్లో కొత్త సభ్యుల చేర్పుల దరఖాస్తులను కూడా పరిశీలించేందుకు సిద్ధమమవుతోంది. వాస్తవంగా పౌరసరఫరాల శాఖ అధికారుల

నిరంతర ప్రక్రియగా దరఖాస్తుల స్వీకరణ..

రేషన్ కార్డుల్లో కొత్త సభ్యుల చేర్పుల కోసం దరఖాస్తుల స్వీకరణ కొనసాగిస్తూనే.. లాగిన్‌లో ఆమోదించే ఆప్షన్‌ను మాత్రం ప్రభుత్వం నిలిపివేసింది. అయితే.. రేషన్ కార్డులోని సభ్యుల తొలగింపు నిరంతర ప్రక్రియగా తయారైంది. పదేళ్లలో రేషన్ కార్డులోని సుమారు 34,51,853 మంది లబ్ధిదారులను ఏరివేసిన ప్రభుత్వం .. సుమారు 6.5 లక్షల కొత్త సభ్యుల అమోదాన్ని మాత్రం పెండింగ్‌లో పడేసింది. గత ప్రభుత్వ హయాంలో వివిధ కారణాలతో సగానికి పైగా సభ్యులు ఏరివేతకు గురయ్యారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వం ఉమ్మడి రాష్ట్రంలోని తెల్లరేషన్ కార్డులన్నింటిని రద్దు చేసి వాటిని పూర్తిగా ఆహార భద్రత కార్డులుగా మార్పు చేసింది. పాత కార్డుదారులతో పాటు కొత్తగా దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ కార్డులు మంజూరు చేసింది. ఆ తర్వాత అనర్హులు, బోగస్, టాక్స్ పేయర్స్, ఇన్‌యాక్టివ్ పేరుతో కార్డులు, సభ్యులను ఏరివేస్తూనే వరుసగా రెండేళ్ల పాటు కార్డులో చేర్పులు, మార్పుల ప్రక్రియకు అవకాశం కల్పించి ఎప్పటికప్పుడు క్లియర్ చేస్తూ వచ్చింది. ఆ తర్వాత పాత కార్డుల్లో కొత్త సభ్యుల చేర్పులు కోసం దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగిస్తూనే ఆమోదించే లాగిన్‌ను మాత్రం నిలిపివేసింది. దీంతో దరఖాస్తుల పెండెన్సీ భారీగా పెరిగిపోయింది.

పదేళ్లలో రేషన్‌కార్డుల యూనిట్ల తొలగింపు ఇలా ..

జిల్లా	మొత్తం యూనిట్లు	ప్రస్తుత యూనిట్లు	తొలగించిన యూనిట్లు
హైదరాబాద్	41,40.692	23,61,440	17,79,252
రంగారెడ్డి	27,27,993	18,21,881	9,06,112
మేడ్చల్	24,83,752	17,17,263	7,66,489

హైదరాబాద్ పరిధిలో రేషన్‌కార్డులో కొత్త సభ్యుల చేర్పుల కోసం దరఖాస్తులు ఇలా..

పౌరసరఫరాల శాఖ సర్కిల్	కార్డులు	కొత్త సభ్యులు
మలక్‌పేట-1	12,805	21,616
యాకుత్‌పురా-2	18,825	33,267
చార్మినార్-3	24,129	42,172
నాంపల్లి-4	5,430	8,502
మెహిదీపట్నం-5	17,143	29,499
అంబర్‌పేట-6	9,294	14,493
ఖైరతాబాద్-7	15,047	24,330
బేగంపేట్-8	10,926	17,840
సికింద్రాబాద్-6	8,626	13,452

ఈపీడీఎస్ ఎఫ్ఎస్‌సీ ఆన్‌లైన్ లాగిన్‌లో రేషన్ కార్డుల్లో పాత సభ్యుల తొలగింపునకు ఆప్షన్ ఉన్నప్పటికీ.. కొత్త సభ్యుల దరఖాస్తుల ఆమోదానికి మాత్రం ఆప్షన్ లేకుండా పోయింది. దీంతో కొత్తగా వివాహమై అత్త వారింటికి వచ్చిన సభ్యులతో పాటు జన్మించిన కొత్త సభ్యుల చేర్పుల కోసం ఆన్‌లైన్‌ద్వారా దరఖాస్తులు చేసుకుంటున్నప్పటికీ ఆమోదం మాత్రం సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో పడిపోయింది.

మూడు లక్షలపైనే దరఖాస్తులు..

ఎనిమిదేళ్లుగా రేషన్ కార్డులో కొత్త సభ్యుల చేర్పుల ప్రక్రియ పెండింగ్‌లో మగ్గుతోంది. గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో రేషన్‌కార్డులు కలిగిన సుమారు 17,21,603 కుటుంబాలు ఉండగా అందులో 59,00,584 సభ్యులు ఉన్నారు. సుమారు మూడు లక్షల కుటుంబాలు తొమ్మిది లక్షల కొత్త సభ్యుల పేర్ల నమోదు కోసం దరఖాస్తు చేసుకున్నట్లు ఆన్‌లైన్ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అందులో కనీసం క్షేత్ర స్థాయి విచారణ లేకుండా ఇన్‌స్పెక్టర్ల లాగిన్‌లో 70 శాతానికిపైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా, విచారణ పూర్తయి ఏఎస్‌వో, తహసీల్ లాగిన్‌లో 20 శాతం దరఖాస్తులు, డీఎస్‌వో లాగిన్‌లో 5 శాతం దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు ఆన్‌లైన్ నివేదిక స్పష్టం చేస్తోంది.

బీఆర్‌ఎస్‌ను వీడే ప్రసక్తే లేదు

డీసీఎంఎస్ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి

చేవెళ్ల: బీఆర్‌ఎస్ పార్టీని వీడే ప్రసక్తే లేదని డీసీఎంఎస్ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాను పార్టీ మారుతున్నట్లు కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదన్నారు. బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతానని, పార్టీని వీడే ఆలోచన కానీ అవసరం కానీ లేదన్నారు. సబితమ్మ వెంటే ఉంటానని స్పష్టం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని గెలిపించుకోవడమే లక్ష్యంగా పనిచేస్తామని చెప్పారు. కేసీఆర్, కేటీఆర్, సబితారెడ్డి నాయకత్వంలో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

ప్రజలు ఆ పార్టీని నమ్మే పరిస్థితి లేదన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు పి.ప్రభాకర్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కావలి రవికుమార్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ బి.నర్సింలు, నాయకులు మాధవ్‌రెడ్డి, రాంప్రసాద్, మల్లేశ్, నరేందర్‌రెడ్డి, తోట చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

ఉప్పల్: ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రామంతాపూర్, వాసవి కాలనీ, వెంకట్‌రెడ్డి నగర్‌కు చెందిన జస్వంత్(23) ఓయూలో ఎమ్మెస్సీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. శనివారం రాత్రి భోజనం చేసి నిద్రించేందుకు పెంట్ హస్‌లోకి వెళ్లాడు. ఆదివారం ఉదయం అతడి తమ్ముడు సాయిచరణ్ పెంట్‌హస్‌లోకి వెళ్లి చూడగా గదిలో కనిపించలేదు. బాతు రూమ్ గడియపెట్టి ఉండటంతో అతను బాత్‌రూమ్ తలుపులు తెరిచి చూడగా జస్వంత్ కరెంట్ వైర్‌తో ఉరివేసుకుని కనిపించాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కాసుల పంట.. క్యారెట్

వరికి ప్రత్యామ్నాయంగా సాగు

- తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు
- నల్ల రేగడి నేలలు అనుకూలం
- 100 నుంచి 120 రోజుల్లో పంట చేతికి
- వ్యవసాయ శాఖ మండల అధికారి వెంకటేశం సూచనలు





తిర్మలాపూర్‌లో క్యారెట్ పంటను కోస్తున్న రైతులు

షాబాద్: క్యారెట్ సాగు కర్షకులకు కాసుల పంట పండిస్తోంది. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి రావడంతో పాటు.. అదేస్థాయిలో లాభం పొందవచ్చని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. జిల్లాలో నల్ల, ఎర్ర, మసక నేలలు విస్తారంగా ఉన్నాయని, ప్రస్తుతం ఈ నేలల్లో బోర్లు, బావుల కింద వరి పంటలు సాగవుతున్నాయని వెల్లడిస్తున్నారు. వరికి ప్రత్యామ్నాయంగా, క్యారెట్ వేస్తే మంచి లాభాలు ఉంటాయని మండల వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశం రైతులకు సూచించారు. సాగు ఎలా చేయాలి, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అవి ఇలా ఉన్నాయి.

పొలం తయారీ

పొలాన్ని దుక్కిదున్ని, సిఫార్సు చేసిన మేరకు ఎరువులను వాడి.. పొలం మెత్తగా ఉండేలా చూసుకోవాలి. చిన్న మడులుగా చేసుకుని, 25 సెంటీమీటర్ల దూరంలో బోదెలు వేసుకొని సాగుకు పొలాన్ని సిద్ధం చేసుకోవాలి.

విత్తన రకాలు

కరోడ, పూసా కేసర్, పూసా మయదగ్ని, నాంటిస్ ఇండియా గోల్డ్ ఈ రకాలను సాగుకు వినియోగించాలి. ఫలితంగా 100 నుంచి 120 రోజుల్లోగా పంట చేతికి వస్తుంది. ఎకరాకు 3కిలోల విత్తనం సరిపోతుంది.

ఎరువుల వాడకం

ఎకరాకు 4 నుంచి 5 టన్నుల పశువుల ఎరువు, యూరియా 40 కిలోలు, ఎస్ఎస్‌పీ (సూపర్) 110 కిలోలు, పొటాష్ 60 కిలోలు, సూపర్ మొత్తం 110 కిలోలు, పొటాష్ 60 కిలోలు, యూరియా 20 కిలోలు ఆఖరి దుక్కిలో వేయాలి. మిగతా 20 కిలోల యూరియాను పంట 40 నుంచి 45 రోజుల్లో పైపాటుగా వేసుకోవాలి. దుంప ఊరే సమయంలో 13:0:45ని 5గ్రాములు తీసుకుని, లీటరు నీటిలో కలిపి ఎకరాకు రెండు సార్లు పిచికారీ చేయాలి.

కలుపు యాజమాన్యం

విత్తనం వేసిన రెండు రోజుల్లో పెండి మిథాల ఒక లీటరును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. 25 రోజుల తర్వాత మెట్రిబుజిన్ 1.5 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.

నీటి తడులు

8 నుంచి 15 రోజుల వ్యవధిలో నీరు పట్టాలి. డ్రిప్, ఎత్తయిన మడుల ద్వారా నీరందిస్తే నాణ్యత దుంపలతో పాటు అధిక దిగుబడి పొందవచ్చు.

సస్యరక్షణ చర్యలు

క్యారెట్ సాగులో సస్యరక్షణ చర్యలు చాలా తక్కువ. ఆకుమచ్చ నివారణకు మాంకోజెట్ 3 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.

పంట కోత

దుంపలు ముదిరిన తర్వాత నారింజ రంగుకు మారుతాయి. దీంతో పొలానికి నీరుపెట్టి, మరుసటి రోజు ఆకులతో సహా దుంపలను తీసివేయాలి. కోత ఆలస్యం అయితే నాణ్యత తగ్గుతుంది. యాజమాన్య పద్ధతులను బట్టి ఎకరానికి 10 నుంచి 15 టన్నుల దిగుబడి వస్తుంది.

మెలకువలు

విత్తనాన్ని ఇసుకతో కలిపి నాటుకోవాలి. విత్తనం, ఇసుక 1:4 నిష్పత్తిలో కలిపి నాటితే మంచిది. నత్రజని మోతాదుకు మించి వాడకూడదు. మోతాదు మించితే, కోత ఆలస్యమై పగుళ్లు ఏర్పడతాయి. కాల్షియం లోపంతో దుంపపై నొక్కులు ఏర్పడి నల్లటి మచ్చలు వస్తాయి. దీని నివారణకు కాల్షియం నైట్రేట్ 5 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. పొలాన్ని సరిగ్గా దుక్కి చేయకపోయినా, సేంద్రియ ఎరువులు వాడకపోయినా దుంప నేలలోకి వెళ్లకుండా చీలిపోతుంది. కాబట్టి దుక్కి జాగ్రత్తగా చేయాలి.

ప్రయాణికుడికి సెల్‌ఫోన్ అందజేత

మూసాపేట: ఓ ప్రయాణికుడు కూకట్‌పల్లి ఆర్టీసీ బస్సులో మరిచిపోయిన మొబైల్ ఫోన్ ఆదివారం ఆర్టీసీ సిబ్బంది అతడికి అప్పగించారు. వివరాల్లోకి వెళితే..కేపీహెచ్‌బీ నుంచి మెహిదీపట్నం రూట్ నెంబర్19ఎం/పీ బస్సులో మెహిదీపట్నంలో ఎక్కిన ప్రయాణికుడు మసాబ్‌ట్యాంక్ వద్ద దిగి వెళ్లిపోయాడు. బస్సులో అతడు సెల్‌ఫోన్ మర్చిపోయినట్లు గుర్తించిన కండక్టర్ సరిత కూకట్‌పల్లి డిపోలో అందజేసింది. ప్రయాణికుడు డిపో అధికారులను సంప్రదించగా ఆదివారం డిపో ఎస్‌టీఐ మల్లేశం అతడికి మొబైల్ ఫోన్‌ను అందజేశాడు. డ్రైవర్ రాజ్‌కుమార్, కండక్టర్ సరితలను పలువురు అభినందించారు.

మైనింగ్ వద్ద పేలుడు పదార్థాలు స్వాధీనం

ఆమనగల్లు: కడ్తాల్ మండలం చల్లంపల్లి గ్రామ సమీపంలోని సర్వే నంబర్ 82లో ఉన్న మైనింగ్ వద్ద అక్రమంగా నిలువ ఉంచిన 13 కట్టల పేలుడు పదార్థాలు (డిటోనేటర్స్) స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ శివప్రసాద్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు చల్లంపల్లి సమీపంలోని మైనింగ్ వద్ద తనిఖీ చేయగా అక్కడ ఉన్న షెడ్డులోని బ్యాగులో పేలుడు పదార్థాలు గుర్తించినట్లు చెప్పారు. అక్కడే ఉన్న సూపర్‌వైజర్ శంకర్‌ను ప్రశ్నించగా తాను మూడేళ్లుగా సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నానని, మైనింగ్ వద్ద జై భవానీ ఎంటర్‌ప్రైజెస్ కంపెనీ నిర్వాహకుడు రాజేందర్ బ్లాస్టింగ్ పనులను నిర్వహిస్తాడని తెలిపాడు. రెండు రోజుల క్రితం డిటోనేటర్లు తీసుకువచ్చి ఇక్కడే ఉంచినట్లు చెప్పాడు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో డిటోనేటర్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని, సూపర్‌వైజర్ శంకర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు. బ్లాస్టింగ్ నిర్వాహకుడు రాజేందర్, మైనింగ్ కంపెనీ యజమాని అశ్వనీ, కేర్‌టేకర్ శ్రీనివాస్‌పై కూడా కేసు నమోదు చేశామని.. వారు పరారీలో ఉన్నారని తెలిపారు.

పౌల్ట్రీ ఫాం యజమానిపై కేసు నమోదు

ఆమనగల్లు: కడ్తాల్ మండల సమీపంలోని పౌల్ట్రీఫాంలో బాలుడిని పనిలో పెట్టుకున్నందుకు ఫాం యజమాని సుధీర్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు సీఐ శివప్రసాద్ తెలిపారు. పౌల్ట్రీఫాం యజమాని మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన 16 సంవత్సరాల బాలుడిని పనిలో పెట్టుకున్నాడని చెప్పారు. కడ్తాల్ పోలీసులు, షాద్‌నగర్ షీటీం పోలీసులు తనిఖీలు నిర్వహించి బాలుడిని పనిలో పెట్టుకున్నట్లు గుర్తించినట్లు వివరించారు. ఈ మేరకు యజమాని సుధీర్‌రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ వైస్ చైర్మన్‌గా యాదిరెడ్డి



చేవెళ్ల: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యవర్గంలో తనకు అవకాశం రావడం ఎంతో సంతోషంగా ఉందని మల్కాపూర్ గ్రామానికి చెందిన పార్టీ లీగల్‌సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్, న్యాయవాది బక్కరెడ్డి యాదిరెడ్డి అన్నారు. చేవెళ్లలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్‌పార్టీ లీగల్‌సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా తనని లీగల్‌సెల్ రాష్ట్ర చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ నియమించి నియామకపత్రం అందజేసినట్లు తెలిపారు. పార్టీ బలోపేతంలో లీగల్‌సెల్ ప్రముఖ పాత్ర పోషిస్తుందని చెప్పారు. ఈ కమిటీలో తనకు అవకాశం కల్పించిన పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మాజీ ఉంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, నియోజకవర్గం ఇన్‌చార్జి పామెన భీంభరత్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని యువకుడి మృతి

నాంపల్లి: రైలు ఢీకొని గుర్తుతెలియని యువకుడు మృతి చెందిన ఘటన నాంపల్లి జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చందానగర్-లింగంపల్లి రైల్వేస్టేషన్ల మధ్యలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..సుమారు 25 ఏళ్ల వయస్సు గల ఓ గుర్తు తెలియని యువకుడు చందానగర్-లింగంపల్లి రైల్వే స్టేషన్ల మధ్యలో రైలు పట్టాలు దాటుతుండగా అటుగా వచ్చిన ఓ రైలు ఢీకొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న జీఆర్పీ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుడి ఒంటిపై తెలుపు, నీలం రంగు గళ్ల చొక్కా, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ఫ్యూచర్‌సిటీ రహదారికి భూములివ్వం



లేమూరులో సమావేశమైన రైతులు

తేల్చి చెప్పిన బాధిత రైతులు

కందుకూరు: ఫ్యూచర్ సిటీ రహదారికి భూములు ఇచ్చేదిలేదని బాధిత రైతులు తీర్మానించారు. మండల పరిధిలోని లేమూరులో ఆదివారం ఫ్యూచర్ సిటీ రహదారిలో భూములు కోల్పోతున్న ఐదు గ్రామాల రైతులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రైతులు డి.సుధాకర్, నారాయణ, ఢిల్లీ గణేశ్, స్వామి, కె.గణేశ్, కె.ఐలయ్య, ప్రశాంత్‌రెడ్డి, కె.రాజు తదితరులు మాట్లాడారు. ప్రభుత్వం ఫ్యూచర్ సిటీలోకి వంద మీటర్ల మేర రహదారి నిర్మించడానికి తమ భూముల నుంచి సర్వే చేసి హద్దురాళ్లు పాతిందని తెలిపారు. తమకు అరకొర పరిహారం ఇవ్వడానికి చూస్తోందని, ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో తమ భూముల విలువ దాదాపు ఎకరం ధర రూ.4 కోట్ల నుంచి రూ.5 కోట్ల వరకు పలుకుతోందన్నారు. అంత డబ్బు ప్రభుత్వం ఇవ్వదని, అందుకోసం తమ భూములు ఇవ్వడానికి అంగీకరించేదిలేదన్నారు. కొత్తగా రహదారి నిర్మించే బదులు శ్రీశైలం రహదారిని తుక్కుగూడ నుంచి కొత్తూరు గేట్ వరకు గతంలో నిర్మించిన ఫార్మా రహదారిని కలిపేలా విస్తరించేలా ఆలోచించాలన్నారు. దీంతో రైతులు నష్టపోకుండా ఉంటారన్నారు. వీరికి సీపీఎం నాయకులు డి.రాంచందర్, బుట్టి బాల్‌రాజు తదితరులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో రైతులు అనూరాధ, కృష్ణవేణి, రమేష్, తిరుపతయ్య, రాములు, వీరయ్య, జంగయ్య, నారాయణ, రాములు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్ పోటీల్లో ప్రతిభ



పోటీల్లో తలపడుతున్న స్వాములు

కొందుర్గు: హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ సింథటిక్ ప్రధాన అథ్లెటిక్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన 14వ రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్ పోటీల్లో కొందుర్గు మండలం ముట్పూర్ ఉన్నత పాఠశాలకు చెందిన డాక్టర్ సోలపోగుల స్వాములు ప్రతిభ చాటారని ఎంఈఓ గాయత్రి దేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. షాట్‌పుట్, జావలిన్‌త్రోలో బంగారు పతకం, డిస్కస్‌త్రోలో వెండి పతకం సాధించినట్లు చెప్పారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులకు మార్చి 4 నుంచి 9వ తేదీ వరకు జాతీయ స్థాయి పోటీలు ఉంటాయని తెలిపారు. ఈ సందర్భంగా స్వాములును పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

వర్గీకరణకు మద్దతుగా మహాప్రదర్శన



సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహ మాదిగ

ఆమనగల్లు: హైదరాబాద్‌లో ఫిబ్రవరి 7న ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో 'లక్ష డప్పులు.. వేల గొంతుల మహా ప్రదర్శన' నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహ మాదిగ తెలిపారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కడ్తాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఎమ్మార్పీఎస్ మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన నర్సింహ మాదిగ మాట్లాడుతూ.. వర్గీకరణకు మద్దతుగా మహా ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వ్యతిరేకులకు లక్ష డప్పులు.. వేయి గొంతులతో సమాధానం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు రావుగల్ల బాబుమాదిగ, జిల్లా కార్యదర్శి కిరణ్‌పూలే, ఎమ్మార్పీఎస్ నాయకులు మంగళపల్లి నర్సింహ, గురిగల్ల లక్ష్మయ్య, శంకర్, మంకి శ్రీను, కంబాలపల్లి అంజి, మహేశ్, యాదయ్య, ఒగ్గు మహేశ్, తుప్పరి మహేశ్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం కడ్తాల మండల ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా అబ్బు రమేశ్ మాదిగ, ఉపాధ్యక్షులుగా నరేశ్, మహేందర్, కార్యదర్శిగా యాదయ్య ఎన్నికయ్యారు.

చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడుతున్న ర్యాపిడో డ్రైవర్ అరెస్ట్

అల్వాల్: చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న ర్యాపిడో డ్రైవర్‌ను నేరేడ్‌మెట్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.వరంగల్ జిల్లా, దామర గ్రామానికి చెందిన మంతూరి హరీష్ ర్యాపిడో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 16న అతను నేరేడ్‌మెట్ గీతానగర్ డీమార్ట్ వద్ద స్కూటీపై వెళ్తున్న మహిళ మెడలో నుండి బంగారు గొలుసు లాక్కుని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. శనివారం వాహనాలను తనిఖీ చేస్తుండగా డిఫెన్స్ కాలనీ వద్ద నెంబర్ ప్లేట్ లేని బైక్‌పై వెళుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా చైన్ స్నాచింగ్ విషయం వెలుగులోకి వచ్చింది. చోరీ సొత్తును అతను మనప్పురం గోల్డ్‌లోన్‌లో కుదవ పెట్టినట్లు తెలిపాడు. నిందితుడు ఉపయోగించిన బైక్‌ను సైతం గత నవంబర్‌లో నిజామాబాద్ జిల్లా, గుడితండాలోని ఓ పొలం వద్ద నిలిపి ఉన్న వాహనాన్ని దొంగిలించినట్లు గుర్తించారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

బేకరీలో తనిఖీలు

ధారూరు: మండల కేంద్రంలోని న్యూ బెంగళూర్ బేకరీలో ఆదివారం పోలీసులు తనిఖీలు చేశారు. గడువు దాటిన కలర్ డబ్బాలను గుర్తించారు. వీటిని కేకల తయారీలో వినియోగిస్తున్నట్లు ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్ తెలిపారు. కలర్ డబ్బాలను సీజ్ చేసి బేకరీ నిర్వాహకుడు సచిన్‌పై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

బసిరెడ్డిపల్లి వాసికి డాక్టరేట్



పరిగి: మండలంలోని బసిరెడ్డిపల్లికి చెందిన మద్దులపల్లి పద్మ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా పొందారు. సంస్కృతం విభాగంలో ప్రొఫెసర్ విద్యానంద్ ఆధ్వర్యంలో పీహెచ్‌డీ పట్టా పొందారు. అన్ని భాషలకు సంస్కృతం మూలం అని డాక్టర్ పద్మ అన్నారు.

ఆత్మహత్యా.. అపహరణా?



పెద్దచెరువులో గాలిస్తున్న డీఆర్‌ఎఫ్ బృందం



మహేశ్(ఫైల్)

యువకుడి అదృశ్యం

- చెరువు వద్ద లభించిన ఆధారాలు
- చెరువులో డీఆర్‌ఎఫ్ బృందం గాలింపు
- కిడ్నాప్ చేశారంటూ మహేశ్ సెల్‌ఫోన్ నుంచి మెసేజ్‌లు

ఇబ్రహీంపట్నం: ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. అలా కనిపించకుండా పోయిన వ్యక్తికి చెందిన బైక్, ఇతర వస్తువులు పట్నం పెద్దచెరువుకట్టపై లభించడంతో చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడనే అనుమానంతో డీఆర్‌ఎఫ్ బృందం గాలింపు చర్యలు చేపట్టింది. ఈ సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. ఏసీపీ కేపీవీ రాజు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తొర్రూరు బాలాజీనగర్ ఫేస్-11లో నివసించే బత్తుల మహేశ్(30) శనివారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. అదే రోజు సాయంత్రం మహేశ్‌కు తల్లిదండ్రులు ఫోన్ చేయగా.. వస్తున్నానని చెప్పి స్విచ్ఛాఫ్ చేశాడు. అనుమానం వచ్చిన కుటుంబీకులు చుట్టుపక్కల వెతికారు. బంధువుల వద్ద ఆరా తీశారు. అయినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో హయత్‌నగర్ ఠాణాలో ఫిర్యాదు చేయగా.. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

చెరువు కట్టపై యువకుడి బైక్

కనిపించకుండా పోయిన యువకుడికి చెందిన బైక్, బ్యాగు, పర్సు, హెల్మెట్ ఇబ్రహీంపట్నం పెద్దచెరువు చిన్నతూం వద్ద వెలుగు చూశాయి. ఎవరో చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నారనే అనుమానంతో స్థానికులు పోలీసులకు సమచారం అందించారు. అక్కడి చేరుకున్న పోలీసులు.. మహేశ్‌కు సంబంధించిన వస్తువులుగా గుర్తించి.. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.

కిడ్నాప్ మెసేజ్..

మహేశ్ ఆచూకీ కోసం యత్నిస్తున్న క్రమంలో.. అతడి సెల్ ఫోన్ ఆన్‌ఆఫ్ అవుతున్నట్లు ఎస్ఐ రామకృష్ణ గుర్తించారు. అనంతరం యువకుడి ఫోన్‌కు వాట్సాప్ మెసేజ్ పెట్టారు. దీనికి సమాధానంగా కిడ్నాప్ చేశారంటూ హిందీలో ఎస్ఐకి మెసేజ్ వచ్చింది. వాట్సాప్ మెసేజ్ కావడం, ఫోన్ ఆన్‌ఆఫ్ అవుతుండటంతో ఎక్కడున్నారనే విషయాన్ని పోలీసులు పసిగట్టలేకపోయారు. ఎవరైనా కిడ్నాప్ చేశారా? లేక మహేశే.. ఈ రకంగా చేస్తున్నాడా అనే సందేహంతో ఎటూ తేల్చుకోలేక పోతున్నారు.